


ఒకరోజు ప్రొద్దున్న నేను హాల్లో కూర్చుని పేపరు చూస్తున్నాను. గేటు తెరిచిన చప్పుడైంది. వరండాలోకి వచ్చాను. ఒక వ్యక్తి—సన్నగా, ఎర్రగా, పొడుగ్గా వున్నాడు. గబగబ నడిచివచ్చాడు నావైపు. ఆత్రుతపడుతున్నట్లుంది అతని వాలకం. నేను ఎవరికోసమని అడిగేలోగానే అతను మాట్లాడాడు.

"మీ బాల్కనీమీద ఎఱ్ఱ గులాబీ పూలు పూస్తున్నాయి కదూ? నాకు రెండు పూలు కావాలండీ. మా చెల్లెలికి పదిహేను రోజులుగా జ్వరం వస్తోంది. మొన్నటినుంచి ఎఱ్ఱగులాబీ పూలకోసం కలవరిస్తోంది. ఎక్కడో, ఎప్పుడో చూసిందిట. కావాలని కూర్చుంది. బజారంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. మీరు రెండుపూలిస్తే..." దీనంగా చూశాడు. నాకు మనస్సు వప్పటం లేదు ఆ పూలు కోసి ఇవ్వడానికి. నాన్నగారు బెంగుళూరునుంచి తెప్పించిన అంట్లు అవి. ఈ ఏడాదే పూస్తున్నాయి మూడు మొక్కలున్నా. ఎంతో అందంగా వున్నాయి ఆపూలు. నేనైనా ఎప్పుడో గానీ ఒక పువ్వు కోయను. అలాంటిది ఈ అపరిచిత వ్యక్తికి ఇవ్వాలంటే మనస్సు వప్పటంలేదు. నేను సందేహించడం గ్రహించాడతను.

"పూలు లేకుండా ఇంటికి వెళ్ళాలంటే భయమేస్తోందండీ. 'అన్నయ్యా, తెచ్చావా' అంటుందది. మనస్సు చివుక్కుమంటుంది. ఏ పార్కులోనూ నాకు తెలిసినవాళ్ళెవరూ లేరు. పోనీ ఒక పువ్వన్నా..."

చెల్లెలు పంచప్రాణాలూ ఆ పూలమీద పెట్టుకుందన్నట్లు మాట్లాడుతున్నాడతను! నా ఆలోచనేమిటి? గబగబ మేడమీద కెళ్ళాను. బాల్కనీ మీద పూలు గాలికి అందంగా వూగుతున్నాయి. పెద్ద పువ్వు ఒకటి కోసుకొచ్చి, అతనికిచ్చాను. నాలో ఎక్కడనుంచో ఔదార్యం పుట్టుకొచ్చింది.

'మీ చెల్లెలి జ్వరం తగ్గేవరకూ రోజూ ఒక పువ్వుకోసి యిస్తాలెండి" అన్నాను. అతను చిరునవ్వుతో పూవు తీసుకుని వెళ్ళిపోయాడు.

నాలుగురోజులు వరసగా వచ్చాడతను. పూలు తీసుకెళ్ళాడు. వాళ్ళ చెల్లెలు ఎంతఆనందం చూపుతున్నదో చెప్పాడు. ఆ పూవుని చేతిలో పెట్టుకునే నిద్రపోతుందిట.

ఒక ఉదయం అతను రాలేదు. నేను హాల్లోనే కూర్చుని వున్నాను. గడియారం ఎనిమిది కొట్టింది. కానీ అతను రాలేదు. ఒకమాటు వరండాలోకి వెళ్ళిచూశాను, నాకు సిగ్గేసింది—ఎందుకు నాకు ఆతుర్దా అని. కానీ, కాస్సేపాగి పైకివెళ్ళి బాల్కనీమీదనుంచి చూశాను. అతని జాడలేదు. ఏమైందో? ఆ చెల్లెలి ప్రాణానికి...ఛీ! ఎందుకొచ్చిన ఆలోచనలు?

నాకు చటుక్కున ఒకటి తోచింది. ఇతనికి నిజంగా చెల్లెలుందా? ఇతను చెప్పినదంతా నిజమేనా? కాకపోవచ్చు. జ్వరం వస్తే పిల్లలు పూలకోసం కలవరిస్తారా? కలవరించినా పెద్దవాళ్ళు మరిపిస్తారు కానీ ఇల్లా వూళ్ళో అందరి యిళ్ళకూ పోయి పూలు తీసుకొస్తారా? అంతా అబద్ధంగా, అసంబద్ధంగా తోచింది నాకు. మరెందుకు

వస్తున్నట్లు అతను? అసలు పూలకోసమేనా? అంతగా పూలు కావలసివస్తే కొనుక్కోలేడూ? తనే ఎందుకు వస్తాడు రోజూ? ఎవరినైనా పంపడూ— ఈ కాలం కుర్రాళ్ళు అసాధ్యులు నవలలు, కథలు చదివి ఆడపిల్లలతో పరిచయాలు కలిగించుకోవడానికి కొత్తకొత్త మార్గాలు కనిపెడుతున్నారు. ఇదొక రకం కావచ్చు. రేపు రాగానే చెప్పేస్తాను పూలు ఇవ్వడానికి వీల్లేదని హాల్లోకివచ్చి మళ్ళీ పేపరు చూడడం మొదలు పెట్టాను. అతని ముఖం జ్ఞాపకం వచ్చింది. వాడిపోని చిరునవ్వు. ఆ కళ్ళు-తమాషాగా వాలుస్తాడు రెప్పలు. చాలా నీటుగా వున్నాడు మనిషి మాత్రం. ఐనా—నా కెందుకు అతన్నిగురించి యోచన?

మర్నాడు వచ్చాడతను. అతను వచ్చేవరకూ తహతహ లాడేనేమో నేను అనిపించింది. ఏమిటి నాలో మార్పు? పొద్దున్నే లేచినప్పటినుండి అతని రాకకోసమే చూస్తున్నానా నేను? అతని కా పువ్వు ఇవ్వడం, అతను చిరునవ్వుతో అందుకోవడం, ఇదంతా అలవాటై పోతోందా? లేకపోతే నా కెందుకీ తహతహ! పొద్దున్నే స్నానంచేసి, కొత్త గులాబీ చీరె కట్టుకున్నాను ఒకటికి రెండుసార్లు చూసుకున్నాను అద్దంలో. ఎఱ్ఱ గులాబీ పూలు కోసి తల్లో పెట్టుకున్నాను. అతను వచ్చాడు. లోపలి కొచ్చి కూచోమని ఆహ్వానించాను. అతను చాలా సరదాగా మాట్లాడాడు. మధ్యమధ్య అందంగా నవ్వుతాడతను.

పది రోజులు గడిచాయి; నాలో మార్పు నా కవగాహన కావడం మొదలుపెట్టింది. నా అలంకరణలో శ్రద్ధ ఎక్కువ చూపుతున్నాను. పూలు కోయడమంటే ఎంతో బాధగా అనిపించే నాకు, అదో సరదా ఐంది. అతని రాక తప్పనిసరి సంఘటనైంది. అతను నా పరిచయం కోసమే వస్తున్నాడన్నమాట నేను ఖాయపరచుకున్నాను. కాని అది తప్పేమో అన్న ఆలోచన రాలేదు నాకు. ఎప్పుడో ఒకనాడు చెప్పకపోతాడా అనుకున్నాను. అప్పుడే అతన్ని మందలిద్దామని అనుకున్నాను. కాని-నేనతన్ని ప్రోత్సాహం చెయ్యటం లేదూ? ఏమో!

హఠాత్తుగా అతను రావడం మానేశాడు. వరసగా వారం రోజులు రాలేదు. పొద్దున్నంతా కలతగా గడిచేది నాకు. ఏదో కలతగా అనిపించేది. ఎందుకు రాలేదు? నాన్నగారు గానీ మరెవరైనా గానీ చూసి మందలించేరా? ఎవరూ చూసే అవకాశం లేదే! ప్రొద్దున్నపూట హాల్లో ఎవరూ వుండరు. అతనికే ఏమైనా జబ్బు చేసిందేమో నా గుండె దడదడ కొట్టుకుంది. అతనెక్కడుంటాడో, ఏంచేస్తాడో కూడా కనుక్కోలేదు కానీ అతనొస్తాడు ఎప్పుడో! అతను వచ్చేది పూలకోసమైతేగా! చిరునవ్వు విరిసింది నా ముఖాన—గర్వపడ్డానేమో అనిపించింది.

మరునాడు నాపేర కవరు వచ్చింది అపరిచితమైన దస్తూరీ. ఎవరిదో అనుకుంటూ విప్పాను. అతనే!

"కుమారి ——గారికి,

నేను హఠాత్తుగా కనిపించకుండా పోవడం మీకు ఆశ్చర్యం కలిగించి వుండవచ్చు మీకు నేను క్షమాపణ చెప్పుకోవలసిన అవసరం ఎంతో వుంది. నేను మీకు చెప్పినట్లుగా నాకు చెల్లెలూ లేదు, ఎవరికీ జ్వరం రానూలేదు చెల్లెలికి ఎఱ్ఱ గులాబీ పూలు కావాలని అడిగినమాటకూడా అబద్ధమే. మరెందుకొచ్చానంటారేమో, ఇక్కడే నేను మీకు క్షమాపణ చెప్పుకోవాలి. నా మనస్సు ఆనందంతో నిండుతోంది."—అసలు సంగతి చెబుతున్నాడు ఆదుర్దాగా గబగబ చదవసాగాను.

"నేను ఒక సంవత్సరంగా పిచ్చివాడినై తిరుగుతున్నాను ఒకపిల్లమీది ప్రేమతో. ఆ చంచలాక్షి క్రిందటి నెలలోనే నన్ను కటాక్షించింది. మాటల సందర్భంలో తనకి ఎఱ్ఱగులాబీ పూలంటే ఎంతో యిష్టమని చెప్పింది. అవి సంపాదించి యిచ్చి, ఆమె ముఖాన చిరునవ్వు చూద్దామని నాకు కోరిక కలగడం సహజం ఎక్కడ దొరుకుతాయి ఈ అపురూప పుష్పాలు? రోజూ సైకిల్ మీద ఇలా పోతూ మీ బాల్కనీపైకి చూసేవాడిని. ఈ పూలు నన్ను ఆకర్షించాయి. ఒకటి రెండుసార్లు మిమ్మల్ని కూడా చూశాను మేడమీద. ఎలాగైనా పూలు సంపాదించాలని కథ అల్లాను. మీలాంటి వారి హృదయం తేలిగ్గా కరిగించవచ్చని ఆశించాను. మీరు నమ్మారు, పూలు ఇచ్చారు. నా దేవత చాలా చాలా ఆనందించింది. మా పెళ్ళికూడా నిశ్చయమైంది. మీతో ఇవన్నీ ముఖతః చెప్పే


సాహసం లేకపోయింది నాకు. మీరు నన్ను క్షమించాలి. మీబాల్కనీమీద పూసేంత అందమైనపూలు నే నెక్కడా చూడలేదంటే అతిశయోక్తి కాదు. అంతచక్కని పూలు పూయిస్తున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. నన్ను మన్నించండి..."

నా చేతిలోంచి జారిపోయింది ఉత్తరం. సోఫాలో కూలబడ్డాను. నిశ్చేష్టితంగా గోడవంక చూడసాగాను. నా మనస్సులో ఒకమూలనుంచి ఏదోఆవేదన, బాధ పొడసూపింది. గిలగిలలాడాను కాస్సేపు అర్థంకాని ఆవేశంతో. కాసేపు ఏడ్చాను. నేనెందుకు బాధపడుతున్నాను? అతనిమీద నాకు ప్రేమకలిగిందా? అప్పుడర్థం కాలేదు నాకు.

ఆ రాత్రి మేడమీద గదిలో అద్దంముందు నుంచున్నాను. నా కళ్ళు మెరుస్తున్నాయి. కంఠం, బుగ్గలు, నుదురు—అన్నీ కాంతితో శోభిస్తున్నాయి. నేనందమైనదాన్నే-నేనెందుకు ఏడ్చాను పొద్దున్న?

అతనంటే ఇష్టమా నాకు? ఏమో!...కాదు. నేను హతాశురాలినే ఐనాను. నాకు తెలియకుండానే నేనతన్ని ఆహ్వానించాను. నాలో ఏవో మార్పులు నేనే కలిగించుకున్నాను. ఏదో జరుగుతుందనీ, అతను పిచ్చివాడల్లే నావెంట పడ్డాడనీ ఊహించుకున్నాను. ఒక ప్రణయం సాగుతుందనుకున్నాను. అదంతా జరగలేదు. అతను నాకోసం రాలేదు. ఆ విషయం నాకతను తెలియచేయకపోయినా బాగుండేది. ఇప్పుడు నా స్వాభిమానం దెబ్బతిన్నది. అందుకు ఏడ్చాను నేను. ముందుకు వంగి అద్దంలో చూసుకున్నాను నేనందమైనదాన్నే. కానీ-గిరుక్కున అద్దంమీద కర్టెను లాగేసి వెనక్కి తిరిగాను. ★


# ఇండియన్ బ్యాంక్, లిమిటెడ్

(స్థాపితం  1907)

హెడ్ ఆఫీసు: 'ఇండియన్ బ్యాంక్ బిల్డింగ్స్', నార్తు బీచ్‌రోడ్డు, మద్రాసు–1

దక్షిణ ఇండియా యందంతటనూ, బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీలోనూ బ్రాంచీలు, సబ్‌ఆఫీసులు గలవు.

మూలధనము

| | | | |
|---|---|---|---|
| అనుమతి పొందినది | ... | రు. | 1,00,00,000 |
| చందా వేసినది | ... | రు. | 72,00,000 |
| చెల్లించినది | ... | రు. | 60,20,000 |
| రిజర్వు & ఇతర ఫండ్సు | ... | రు. | 77,50,000 |
| డిపాజిట్లు (31-12-55) | ... | రు. | 29.44 కోట్లు |

అన్ని రకములైన బ్యాంకింగు వ్యాపారములు జరుపబడును.

యన్. గోపాల అయ్యర్, సెక్రటరీ.